
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ప్రజాగళమై : రావులపాలెం హైవేపై బాబు రోడ్‌షోకు వెల్లువెత్తిన అభిమానం


కురిసింది పూలవాన : మండపేట రోడ్‌షోలో నమస్కరిస్తున్న చంద్రబాబు


కూటమి అభ్యర్థులను గెలిపించండి : ద్రాక్షారామలో మాట్లాడుతున్న చంద్రబాబు


మనదే విక్టరీ కావాలి..
నీకోసమే చూస్తున్నాం : రావులపాలెం జాతీయ రహదారిపై బాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న అభిమాని



నేను మీ వాడిని..

మీరు వేసే ఓటు.. మీ భవిష్యత్‌కే..

- ప్రజాగళం సభలు సూపర్‌హిట్
- అండగా ఉంటానని బాబు హామీ
- రావులపాలెంలో జగ్గిరెడ్డిపై ఫైర్
- ద్రాక్షారామలో తోట, బోస్‌లపై ఆగ్రహం
- అడుగడుగునా నీరాజనం
- సభా ప్రాంగణాలకు వెల్లువలా జనం
- కూటమిలో సమరోత్సాహం

కాకినాడ, అమలాపురం (ఆంధ్రజ్యోతి)/రావులపాలెం/ద్రాక్షారామ/ మండపేట, ఏప్రిల్ 3: జనం... జనమే జనం... అడుగడుగునా బ్రహ్మరథం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. అధినేత ఆగమనం అలస్యం అయినా వేయి కళ్లతో ఎదురుచూశారు.. వైసీపీ పాలనలో దగాపడ్డ తమకు చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏంచేస్తారో చెబితే వినడానికి బారులు తీరారు. వచ్చిన జనాలను చూస్తుంటే తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోందని ధీమా వ్యక్తంచేశారు. గోదావరి జిల్లా ప్రజలు మంచితనానికి మారుపేరంటూ కొనియాడారు. మంచినీళ్లు అడిగితే కొబ్బరి నీళ్లు ఇచ్చేంత మంచివారు అంటూ వేనోళ్ల పొడిగారు. పూతరేకులు తీయదనం ఇక్కడి ప్రజల మనసుల్లో ఉంటుందంటూ ఈ ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం, రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రావులపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రజాగళం తొలి బహిరంగ సభకు జనం పోటెత్తారు. చంద్రబాబు రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4 గంటల సమయంలో మల్లయ్యదొడ్డిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. కూటమి శ్రేణులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి చంద్రబాబు సుమారు మూడు కిలోమీటర్ల రోడ్‌షో నిర్వహించారు. అక్కడ అభిమానులు ఏర్పాటు చేసిన భారీ గజమాలను క్రేన్ సాయంతో చంద్రబాబుకు అలంకరించారు. అనంతరం రావులపాలెం తెలుగుదేశం మండల పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రావడం తథ్యమని, చంద్రబాబు పాలన కోసం రాష్ట్రం ఎదురుచూస్తోందన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లు ఈ ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా జగ్గిరెడ్డి తరిమితరిమికొట్టి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ స్థానాలను గెలిచి చంద్రబాబు కానుకగా అందిస్తానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. చంద్రబాబునాయుడు 50 నిమిషాలకుపైగా ప్రసంగించారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అవినీతి, అక్రమాలపై చంద్రబాబు మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కోనసీమ ప్రజల గొప్పదనాన్ని గుర్తుచేస్తూ ఈ ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అన్ని స్థానాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కోనసీమ జిల్లాలో అధికార వైసీపీ అరాచకాలపై చంద్రబాబు ధ్వజమెత్తారు. ఇసుక దోపిడీ దగ్గర నుంచి మట్టి మాఫియా వరకు ఏకరువు పెట్టారు. మంత్రి వేణు చెల్లని కాసు అని మండిపడ్డారు. తన పదవిని కాపాడుకునేందుకు వైవీ సుబ్బారెడ్డి కాళ్లపై పడి బీసీల పరువు మంటగలిపారని ధ్వజమెత్తారు. నియోజకవర్గాన్ని అడ్డంగా దోచుకుతిన్నారని నిప్పులుకక్కారు. తీరా ఎన్నికల ముందు పక్క నియోజకవర్గానికి బదిలీ అయి వెళ్లిపోయారు. ఇక్కడున్న ఎంపీ బోస్‌పైనా చంద్రబాబు ధ్వజమెత్తారు. తోట త్రిమూర్తులు గురించి మాట్లాడుతూ ఇక్కడ ఉండే వ్యక్తి పక్క నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దళితులకు శిరోముండనం చేసిన వ్యక్తి ఆయన అంటూ మండిపడ్డారు. జిల్లాలో దళితులను ఎందరినో వైసీపీ పొట్టనపెట్టుకుందని చంద్రబాబు నిప్పులు కక్కారు. కాకినాడలో తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును పక్కన పెట్టుకున్న జగన్ దళితులను ఏం ఉద్దరిస్తారని ప్రశ్నించారు. ఆయనకు ఊరేగింపులు కూడా వైసీపీ నేతలు చేశారంటే ఎంత కండకావరం అని ప్రశ్నించారు.


రావులపాలెం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు


మన జెండా.. ఎన్నికల్లో ఇలా ఎగరాలి

కోటిపల్లి రైల్వేలైన్ పూర్తి చేస్తాం...

కోనసీమ జిల్లా అంటే బాలయోగి. ఈ ప్రాంతం కోసం ఆయన కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ సాధించారు. కానీ వైసీపీ వచ్చాక కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్రం తన వాటా నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టును నీరుగార్చింది. అందుకే బాలయోగి కల నెరవేర్చేలా టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఓఎన్జీసీ పైపులైను వల్ల మత్స్యకారులకు నెలకు రూ.11 వేల చెల్లింపును టీడీపీ వస్తే ఆపేస్తుందని వైసీపీ ప్రచారం చేస్తోంది. కానీ దీన్ని ఎవరూ నమ్మొద్దు. అవసరమైతే నష్టపరిహారం పెంచేలా చర్యలు చేపడతామన్నారు. గోదావరి కాలువల ఆధునికీకరణ, ఏటిగట్ల పటిష్టం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని రహదారులను బాగు చేస్తామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందిందని ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రావులపాలెంలో ప్రసంగం పూర్తి చేసుకున్న చంద్రబాబు రోడ్డుమార్గంలో జొన్నాడ, ఆలమూరు, గుమ్మిలేరు, మండపేట, మాచవరం, పసలపూడి మీదుగా రామచంద్రపురం చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ రోడ్డుషో నిర్వహిస్తూ సరిగ్గా రాత్రి 9.08 గంటలకు ద్రాక్షారామ చేరుకున్నారు. చంద్రబాబు తన ప్రసంగంలో రామచంద్రపురం అసెంబ్లీ అభ్యర్థి సుభాష్ మంచివాడని.. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడతాడన్నారు. ఎంపీ అభ్యర్థి హరీష్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నేతలు చంద్రబాబుకు నాగలి అందించారు. ముస్లింలు టోపీ అలంకరించారు. చంద్రబాబు రాత్రి పది గంటలకు రామచంద్రపురంలోని వీఎస్ఎం కాలేజీలో బసకు చేరుకున్నారు .గురువారం ఉదయం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతలు, అభ్యర్థులతో సమీక్ష నిర్వహించను న్నారు. రావులపాలెంలో తొలుత హెలిపాడ్ వద్ద తెలుగు మహిళ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి చంద్రబాబుకు హరతిచ్చి స్వాగతం పలికారు. టీడీపీ నేతలు వేగుళ్ల జోగేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు, జనసేన పిఃగన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నాయకుడు రేవు శ్రీను, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టేకుమూడి సత్యనారాయణ, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు టూర్ ఇలా..

రాజమహేంద్రవరం ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు గురువారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ప్రజాగళం యాత్రలు నిర్వహించనున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ఏర్పడి అభ్యర్థులను ఖరారు చేసిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. కొవ్వూరులో సాయంత్రం 4 గంటలకు, గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో 6 గంటల జరిగే ప్రజాగళం సభల్లో ప్రసంగిస్తారు. రాత్రికి నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్‌లో బస చేసి శుక్రవారం ఉదయం పార్టీ నేతలతో సమావేశమవుతారు. అనపర్తి సమస్యతో పాటు జిల్లాలో అక్కడక్కడా ఉన్న అసంతృప్తనేతలను బుజ్జగించే అవకాశం ఉంది. అనంతరం బాబు నరసాపురం వెళతారు.


నువ్వు రావాలయ్యా : ద్రాక్షారామలో జనం జేజేలు


బాబు వస్తారని : రామచంద్రపురంలో మహిళల వెయిటింగ్


దారంతా అభిమానమే : రావులపాలెంలో బాబు కోసం వచ్చిన మహిళలు


కదిలొచ్చిన పసుపు దండు : రావులపాలెంలో బహిరంగ సభ వద్ద మహిళలు


ఇదీ మా స్పెషలండీ..అయ్ : చంద్రబాబుకు పూతరేకుల జ్ఞాపిక

రావులపాలెంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇసుక దోపిడీపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ ఆలోచింపజేసింది.



15 నుంచి సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3: సముద్రంలో మత్స్య సంపదను క్రమబద్ధీకరించే లక్ష్యంతో ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటను నిషేధిస్తూమత్స్య శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సముద్ర జలాల్లో మెకనైజ్డ్, మోటారు బోట్ల ద్వారా నిర్వహించే అన్ని రకాల చేపల వేటను నిషేధించారు. వివిధ రకాల చేపలు, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలను, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా సముద్ర మత్స్య సంపదను సుస్థిరత చేసే లక్ష్యంతో చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. మత్స్య సంతతి అభివృద్ధికి బోట్ల యజమానులు సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపల వేట కొనసాగిస్తే సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని అనుసరించి బోట్ల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా బోట్లతో పాటు బోట్లలో ఉండేమత్స్య సంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అంతే కాకుండా డీజిల్, ఆయిల్ రాయితీలతో పాటు ప్రభుత్వం అందించే అన్ని రకాల సదుపాయాలను నిలుపుదల చేస్తామన్నారు. చేపల వేటను కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్య శాఖ, కోస్టుగార్డు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు.

ఎండల తీవ్రత దృష్ట్యా...
అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 3: ఎండల తీవ్రత దృష్ట్యాజిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పులు చేస్తూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. గురువారం నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తాయని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి ఎం.ఝాన్సీరాణి తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులను ఇంటికి పంపించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలనిసూచించారు. మే 1 నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, మే 16 నుంచి 30వ తేదీ వరకు అంగన్‌వాడీ సహాయకులు వేసవి సెలవులను ఉపయోగించుకోవచ్చని చెప్పారు. అనుబంధ పోషకాహారాన్ని ఎటువంటి అంతరాయం కలగకుండా లబ్ధిదారులకు అందించాలన్నారు.

అటు వారు... ఇటు వీరు

- పెన్షన్ సొమ్ము కోసం బ్యాంకుల వద్ద ఉద్యోగులు.. సచివాలయాల వద్ద వృద్ధులు పడిగాపులు
- పేరూరులో సొమ్మసిల్లిన వృద్ధుడు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 3: రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ సొమ్ములు విడుదల చేయడంలో జాప్యం చేసింది. దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు బ్యాంకుల వద్ద, పెన్షన్‌దారులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు ఇతరులు సచివాలయాల వద్ద పడిగాపులు పడ్డారు. ఉదయమే సచివాలయ ఉద్యోగులు బ్యాంకులకు చేరి చెక్కులు అందజేశారు. టోకెన్లు తీసుకున్నా ఎంతకూ సొమ్ములు చెల్లించకపోవడంతో మధ్యాహ్నం ఇళ్లకు చేరుకున్నారు. కొద్దిసేపటికి బ్యాంకుల నుంచి సమాచారం రావడంతో హుటాహుటిన చేరుకుని నగదు డ్రా చేసుకుని సచివాలయాలకు చేరుకున్నారు. కోనసీమ జిల్లాలో 2,45,477 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. వీరి కోసం రూ.71,43,58,500 విడుదల చేశారు. బుధవారం రాత్రి 8 గంటల సమయానికి 25.38 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశారు. మధ్యాహ్నం 3 గంటలు దాటిన తరువాత పెన్షన్ల పంపిణీని ప్రారంభించినప్పటికీ 60,137 మందికి రూ.18,13,11,000 పంపిణీ చేశారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పెన్షన్ల పంపిణీకి సచివాలయాల వారీగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం అమలాపురం రూరల్ పేరూరు-4 సచివాలయానికి పెన్షన్ కోసం వచ్చిన వృద్ధుడు కురసాల నరసింహమూర్తి ఎండ వేడిమికి స్పృహ కోల్పోయి అక్కడే కుప్పకూలగా స్థానికులు సపర్యలు చేశారు. పలు సచివాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ కోసం మధ్యాహ్నం 3 గంటల వరకు నిరీక్షించారు.


కపిలేశ్వరపురం మండలంలో...


పి.గన్నవరం సచివాలయం వద్ద బుధవారం ఉదయం పెన్షనర్ల పడిగాపులు



అమలాపురం రూరల్ సమనస సచివాలయంలో వృద్ధుల ఎదురుచూపు (ఫైన) పేరూరు సచివాలయం-4లో సొమ్మసిల్లిన వృద్ధుడు నరసింహమూర్తి

దివ్యాంగుల కోసం 'సాక్ష్యం' యాప్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు నూరు శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ సాక్ష్యం యాప్‌ను రూపొందించిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనే విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ యాప్‌ను దివ్యాంగులంతా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో దివ్యాంగులుగా నమోదై ఉండి సదరం ధ్రువీకరణ పత్రం ప్రకారం 40శాతం పైబడి దివ్యాంగత్వం ఉంటే వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. సాక్ష్యం యాప్ ద్వారా హోం ఓటింగ్ కోసం ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం కావాలన్నా, ఇతర వివరాలు తెలుసుకోవాలన్నా, వీల్‌ఛైర్, వలంటీర్ సౌకర్యం కావాల్సి వచ్చినా ఈ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌ఛైర్లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతామన్నారు. అంధులకు బ్రెయిలీ లిపిలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపర్ ఏర్పాటు చేస్తామని, దాని ద్వారా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చన్నారు. ఈవీఎంలపైనా బ్రెయిలీ లిపిలో నంబర్లు ఉంటాయన్నారు. లేదా వలంటీరును ఉపయోగించుకుని ఓటు హక్కు వినియోగించుకోవచ్చని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులకు అనుకూలంగా ఓటింగ్ ప్రక్రియను రూపొందించినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

జగన్నాటకం

ప్రతిపక్షాలపై కుతంత్రం



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టార్గెట్ టీడీపీ.. ఇదే వైసీపీ పాలకులు అధికార దండం పట్టుకున్న నాటి నుంచీ సాగుతున్న రాజకీయ కక్ష కథా చిత్రమ్. సంఘటన ఏదైనా టీడీపీపై బురద జల్లడం ఒకటే అంతిమంగా జగన్ లక్ష్యం. ఈ జాడ్యం చివరికి అవ్వాతాతలను కూడా వదల్లేదు. వైసీపీ నాయకులు తమ రాజకీయ స్వలాభం, ఓట్లు రాబట్టుకోవడానికి నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లను వినియోగించడం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో ప్రభుత్వ పథకాల పంపిణీకి వారిని ఎన్నికల సంఘం దూరం పెట్టింది. ఇది కచ్చితంగా పాలకులు చేసిన పాపమన్న విషయం జగద్విదితమే. అయితే దీనిని కూడా రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకొని టీడీపీ బురద జల్లే రాజకీయ కుట్రకు జగన్ ప్రభుత్వం తెరతీసింది. ఉద్దేశపూర్వకంగానే పింఛను లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టి ఆ నెపం టీడీపీపైకి నెట్టేయాలనుకొంది. ఈ తంతులో భాగంగా పింఛన్ల పంపిణీని కావాలనే ఆలస్యం చేసింది. ప్రభుత్వ ఖజానాలో సొమ్ములు లేవన్న అసలు నిజాన్ని మాత్రం దాచిపెట్టింది. నిజాలను ఫ్యాను గాలితో ఆర్పేసే ప్రయత్నం చేసింది. అయితే పింఛన్ల పంపిణీ తొలి రోజు అయిన బుధవారం అసలు విషయం నిగ్గు తేలింది. ఏలికల కుట్ర తేటతెల్లమైంది.

- వైసీపీ పింఛను డ్రామా
- 'ఖాళీ' జేబును దాచిపెట్టి
- టీడీపీపై బురద జల్లే కుట్ర
- వృద్ధులతోనూ పాలకుల ఆటలు
- ప్రభుత్వం నుంచి డబ్బు రాకపోవడంతో
- సచివాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు
- ఉద్యోగులదీ అదే పరిస్థితి
- బుధవారం సాయంత్రానికి 'తూర్పు' 39 శాతం..
- కోనసీమ జిల్లాలో 24 శాతం..
- కాకినాడ జిల్లాలో 37 శాతం మందికి
- పింఛన్ల పంపిణీ
- సమాచారం లేక లబ్ధిదారుల ఇబ్బందులు

ఖాళీ జేబును దాచి..

పింఛన్ల పంపిణీ విషయంలో ప్రభుత్వం తన ఖాళీ జేబును దాచి పెట్టిందనే విషయం పింఛన్ల పంపిణీ తొలి రోజునే బయటపడింది. వాస్తవానికి ఐదేళ్ల నుంచీ ఆర్థిక క్రమ శిక్షణ గాడితప్పడంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీంతో తెల్లారగానే జోలి పట్టుకొని రుణానికి పరుగులు పెట్టడం అలవాటుగా మారిపోయింది. ఏ పూట రుణం పుడితే ఆ పూట గడుపుతూ పాలన సాగిస్తున్నారు. చివరికి ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వడానికీ ప్రభుత్వం వద్ద పైసలు లేని పరిస్థితిని చూసి వైసీపీ పాలన తీసుకొచ్చిన గొప్ప సంస్కరణగా చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో మార్చి 16 నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలైంది. దీంతో ప్రభుత్వానికి అప్పులు పుట్టడం కష్టమైంది. ఆ విషయాన్ని దాచిపెట్టి ఆర్థిక సంవత్సరం చివరి రోజు, బ్యాంకులకు సెలవు, సర్వర్లు పనిచేయవు, సాంకేతిక కారణాలు అంటూ రకరకాల అవాస్తవాలను తెరపైకి తెచ్చారు. ఏప్రిల్ 1న పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి ముందే తెలుసు కదా? మార్చి 31న యాన్యువల్ క్లోజింగ్ డే అని తెలియదా? సర్కారు ఖజానాలో సొమ్ము లేదు కాబట్టి ఏదోలా అబద్ధాలు వల్లె వేస్తూ ఏప్రిల్ 3 వరకూ పంపిణీ కార్యక్రమాన్ని నెట్టేశారు. మార్చి నెల చివరిలో వేల కోట్ల రూపా యలు వివిధ పనుల నిమిత్తం కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేసిన ప్రభుత్వం.. పింఛన్ల పంపిణీని మాత్రం వాయిదా వేయడం గమనార్హం.

అంతా జగన్మాయ..కావాలని చేసిన కుట్ర..?

సామాజిక పింఛన్ల పంపిణీని సైతం జగన్మాయ వీడలేదు. వలంటీర్లను జగన్ తన సొంత సైన్యం మాదిరిగా వినియోగించడంతో పారదర్శకంగా ఎన్నికల నిర్వహించ డంపై ఆ ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం పలు చర్యలు తీసుకొంది. వలంటీర్లను ప్రభుత్వ పథకాల పంపిణీకి అనుమతించలేదు. దీంతో వలంటీర్లను టీడీపీకి వ్యతిరేకం చేయాలనే కుట్రతో జగన్ ప్రభుత్వం మైండ్ గేమ్ ప్రారంభించింది. వలంటీర్లు అందుబాటులో లేకపోతే పింఛన్ల పంపిణీ ఇబ్బంది అవుతుందని నమ్మించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. వాస్తవానికి సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ పంపించి పింఛన్లు పంపిణీ చేయించవచ్చు. కానీ ఏదో రకంగా టీడీపీపై పాపం నెట్టేయాలనే ఉద్దే శంతో లబ్ధిదారులను సచివాలయాలకు రావాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి మిన హాయింపునిచ్చింది. గత ప్రభుత్వంలో మునిసి పాలిటీ, పంచాయతీ సిబ్బంది పింఛన్లు అందజేసేవారు. ఇప్పుడు సచివాలయ సిబ్బందికి వారిని జతచేస్తే సునాయాసంగా ఇళ్లకు తీసుకెళ్లి పింఛన్లు చేతిలో పెట్టవచ్చు. కానీ, ఆ దిశగా పాలకులు అసలు ఆలోచన చేయపోవడమే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జగన్మాయలో భాగంగా పింఛనుదారులను మండుటెండలో సచివాలయాలకు రప్పించి.. ఇబ్బందులకు గురిచేసి.. టీడీపీని భూతంగా చూపించాలనే కుట్ర చేయడం విస్మయాన్ని కలిగిస్తోందంటూ ప్రజలు వాపోతున్నారు.

తొలిరోజున

తూర్పుగోదావరి జిల్లాలో తొలి రోజున అటు లబ్ధిదారులకు, ఇటు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం నరకం చూపించింది. 3 నుంచి పింఛన్లు ఇస్తామనడంతో ఉదయం 6 గంటలకే లబ్ధిదారులు ఆదరాబాదరా సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే.. చాలాసేపు ఎదురు చూసినా ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో ఉసూరుమంటూ వెనుతిరిగారు. పించను సొమ్ములు సచివాలయ సిబ్బంది ఖాతాల్లో ఉదయం 11 గంటల నుంచి నెమ్మదిగా జమ కావడం ప్రారంభమైంది. కొద్దికొద్దిగా జమచేస్తూ వచ్చారు. దీంతో సచివాలయ సిబ్బంది బ్యాంకులకు వెళ్లి డ్రా చేసుకురావడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రాజమహేంద్రవరం నగర పరిధిలోని ఓ సచివాలయ పరిధిలో 137 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారి నిమిత్తం సుమారు రూ.4 లక్షలు సచివాలయ సిబ్బంది ఖాతాలో జమ కావాల్సి ఉంది. అయితే 3న మధ్యాహ్నం 12 గంటల సమయానికి కేవలం రూ.35 వేలు మాత్రమే ప్రభుత్వం నుంచి జమ అయ్యాయి. ప్రతి చోటా ఇలాంటి ఇబ్బందినే ఎదుర్కొన్నారు. దఫదఫాలుగా ప్రభుత్వం జమ చేస్తుండడంతో సచివాలయ సిబ్బంది పరుగులు పెట్టాల్సి వచ్చింది. జిల్లాలో 2,44,730 మంది లబ్ధిదారుల నిమిత్తం సచివాలయ సిబ్బందికి రూ.72,66,98,500 జమ కావాల్సి ఉంది. కానీ బుధవారం సాయంత్రానికి సుమారు 50 శాతం సొమ్ములు అందినట్టు తెలుస్తోంది. అయితే కేవలం 20 శాతం లబ్ధిదారుల చేతికి మాత్రమే పింఛను అందింది. మిగతా వారికి 4, 5, 6 తేదీల్లో అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.



సముద్రంలో వేటకు అంతరాయం

61 రోజుల పాటు సముద్ర జలాలలో చేపల వేట నిషేధం..

ఈ నెల 15 నుంచి అమలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3 : ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సముద్ర జలాలలో 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమలు కానుంది. ఇందుకు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు సముద్ర జలాలలో యాంత్రిక పడవలు (మెకనైజ్డ్, మోటారు బోట్లు) ద్వారా అన్ని రకాల చేపల వేట సాగించరాదు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పశుసంవర్థక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ జీవో ఆర్‌టీ నెంబర్ 81లో పొందుపరిచింది. వివిధ చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం ముఖ్య ఉద్దేశ్యంగా సముద్ర జలాలలో చేపట వేట నిషేదం అమలు చేస్తున్నారు. ఈ నిషేధ ఉత్తర్వులను అనుసరించి సముద్ర జలాలలో యాంత్రిక పడవలు (మెకనైజ్డ్, మోటారు బోట్లు)పై మత్స్యకారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాల్సి ఉంది. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపల వేట చేసిన బోట్ల యజమానులను ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 ,సెక్షన్ (4) ప్రకారం శిక్షార్హులు కానున్నారు. వారి బోట్లను, బోట్లలో ఉన్న మత్స్య సంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధించనున్నారు. అదే విధంగా ప్రభుత్వం అందించే డీజిల్ ఆయిల్ సబ్సిడీ, అన్ని రకాల సబ్సిడీ సౌకర్యాలను నిలుపుదల చేయనున్నారు. ఈ నిషేధ కాలాన్ని ఖచ్చితంగా అమలు చేసేందుకు మత్స్య శాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసింది. అందువల్ల మత్స్యకారులందరూ సముద్ర జలాలలో చేపల వేట నిషేధ కాలంలో సహకరించాలని రాష్ట్ర మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు కోరారు.

తళుక్కుమన్న శ్రద్ధాదాస్



రాజానగరం, ఏప్రిల్ 3: వనమాలి క్రియేషన్స్‌లో కంభంపాటి సంతోష్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న పారిజాత పర్వం మూవీ ప్రమోషన్‌లో చిత్ర యూనిట్ బుధవారం ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేసింది. హీరో చైతన్యరావు, హీరోయిన్ శ్రద్ధాదాస్ కళాశాలలో సందడి చేశారు. ఈ సందర్భంగా హీరో చైతన్యరావు మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లింగ్‌తో కిడ్నాప్ కథ నేపథ్యంలో అందరినీ అలరించేలా సినిమా రూపుదిద్దుకుందని చెప్పారు. హీరోయిన్ శ్రద్ధాదాస్ మాట్లాడుతూ గోదావరి అందాలు బాగున్నాయని, ఏప్రిల్ 19న సినిమా విడుదల కాబోతోందని కుటుంబ సమేతంగా సినిమా చూసి ఆదరించాలన్నారు. అనంతరం కళాశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి క్రికెట్ ఆడారు. సినిమాలో సాంగ్స్‌కి డాన్స్ చేస్తూ, డైలాగ్స్ చెప్తూ అందరినీ అలరించారు. తొలుత కళాశాల చైర్మన్ కళ్లం ఉపేందర్‌రెడ్డి సినీ బృందానికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, వైస్ ప్రిన్సిపాల్ సూరిబాబు, ఏవో ఇక్బాల్, సిబ్బంది పాల్గొన్నారు.

9 గ్యారెంటీలతో కాంగ్రెస్ భరోసా

రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 9 గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ భరోసా ఇస్తుందని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ కాటన్ హాలులో బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. చారిత్రాత్మక రాజమహేంద్రవరానికి తాను కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే దేశం బాగుపడుతుందన్నారు. సీఎం జగన్ కేంద్రం అమలు చేసిన 18 ప్రజా వ్యతిరేక బిల్లులకు మద్దతుగా నిలిచాడన్నారు. ప్రత్యేక హోదా తీసుకురాలేక పోయాడని, పోలవరాన్ని పూర్తి చేయలేక పోయారని ధ్వజమెత్తారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువస్తే దేశం రాష్ట్రం బాగుపడతాయన్నారు. తాను త్వరలోనే లోకల్ మేనిఫెస్టోను తయారు చేస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, ఏఐసీసీ అబ్జర్వర్ మనోజ్‌చౌహాన్ ఎస్ఎన్ రాజా, జంగా గౌతమ్, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, అరిగెల అరుణకుమారి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత..కేసు నమోదుకు సిఫార్సు



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

తుని రూరల్, ఏప్రిల్3: రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్ కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు పీడీఎస్ బియ్యం తరలించేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. విజిలెన్స్ అధికారులు పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఒక ఆటోలో పీడీఎస్ బియ్యం లోడు చేసి తరలించేందుకు సిద్ధంగా ఉండటాన్ని గమనించారు. దీంతో ఆటో డ్రైవర్‌ను ఆరా తీసి తనిఖీలు చేపట్టగా చేపూరు గ్రామానికి చెందిన రేషన్ షాపు నెంబరు 4కు హెల్పర్ అయిన కొత్తూరు నరసింహారావు సూచనల మేరకే బియ్యం లోడు చేసుకున్నట్లు డ్రైవర్ తెలిపారు. దీంతో సంబంధిత అధికారులు రేషన్‌షాపులో 4లో తనిఖీలు నిర్వహించగా అవకతవకలు బయటపడ్డాయి. విజిలెన్స్ అధికారుల విచారణలో రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్ పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తేల్చారు. 2650 కిలోల పీడీఎస్ బియ్యం, 87 కిలోల పంచదార, 6 కిలోల గోధుమలు సీజ్ చేసి రేషన్ డీలర్‌తో పాటు ఎండీయూ ఆపరేటర్, ఆటో డ్రైవర్‌లపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేసినట్లు విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజయ్‌కుమార్, సీఎస్‌డీటీ విజయ్ కుమార్, జీవానంద శివ పాల్గొన్నారు.

ఓటేస్తూ సెల్ఫీలు దిగడం నిషిద్ధం

సామర్లకోట, ఏప్రిల్ 3: పోలింగ్ కేంద్రంలో ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో సెల్‌ఫోన్‌తో సెల్ఫీలు దిగడం లేక ఇతరులకు చూపించడం నిషిద్ధం.. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే నిబంధన 49ఎం (ఓటు రహస్యం) బహిర్గతం నియమం మేరకు ఎన్నికల అధికారులు గుర్తించి ఓటరును బయటకు పంపిస్తారు. ఆ ఓటును నిబంధన 17ఏలో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు. నిబంధన 49ఎం ప్రకారం అంధులైన ఓటర్లు తమ ఓటు వేయడానికి 18 సంవత్సరాలు దాటిన సహాయకుడిని వెంట తీసుకెళ్లవచ్చు. సహాయకుడు అతని ఓటును బహిర్గతపర్చనని నిబంధన 10లో ధృవీకరించాల్సి ఉంది.

విభజించి..వదిలేశారు..

- ఎక్కడి సమస్యలక్కడే!?.. పుట్టుకొస్తున్న కొత్త సమస్యలు
- నేటితో కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు పూర్తి
- ఇంకా పూర్తికాని పలు శాఖల విభజన
- కలెక్టరేట్ భవనాలకు కూడా పడని పునాది
- అద్దె ఇళ్లల్లో అధికారులు..శాఖల వారీగా అవస్థలు



తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. కానీ జిల్లాల వారీ కొన్ని శాఖల విభజన కూడా ఇంకా పూర్తికాలేదు. గురువారం నాటికి రెండేళ్లు పూర్తయినా ఇంకా చాలా సమస్యలు పరిష్కారం కాకుండానే ఉండిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలుగా విభజించిన సంగతి తెలిసిందే. ఎంతో అట్టహాసంగా పరిపాలన ప్రజల దగ్గర వరకూ తెచ్చేస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుని జిల్లాల విభజన చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కేంద్రంగా ఉండేది. అక్కడ కలెక్టరేట్ ఉండేది. అందువల్ల కొత్త కాకినాడ జిల్లాకు కలెక్టరేట్ సమస్య లేదు. కానీ కొత్తగా అమలాపురం కేంద్రంగా ఏర్పడిన డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలకు కొత్త కలెక్టరేట్లు నిర్మించలేదు. రాజమహేంద్రవరంలో నేక్ భవనంలో కలెక్టరేట్ నడుస్తోంది. గిరిజన యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎత్తేసి అక్కడ కొత్త జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కొత్తలో కలెక్టరేట్ నిర్మాణానికి స్థలాలు పరిశీలించినట్టు చెప్పారు. కానీ ఇంత వరకూ అవి ఎక్కడనేది ఖరారు చేయలేదు. పనులూ లేవు. మరో జిల్లా అధికార కార్యాలయాలు కూడా పూర్తిగా లేవు. కలెక్టర్ డా. కె.మాధవీలత గతంలో ఆర్డీవోలు, సబ్-కలెక్టర్లు నివాసంగా వాడుకున్న క్వార్టర్‌నే క్యాంప్ ఆఫీసుగా మార్చుకున్నారు. అక్కడే నివాసం ఉంటున్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు క్వార్టర్లు లేక అద్దె భవనాల్లో ఉంటున్నారు. ఇంకా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్ డబ్ల్యూఎస్ శాఖల విభజన పూర్తి కాలేదు. వీరికి జిల్లా ఇంజనీరింగ్ అధికారులుగా డిజిగ్నేషన్ ఇచ్చినప్పటికీ అధికారాలు బదిలీ కాలేదు. ఈ శాఖల్లో అధికారులు జిల్లా స్థాయి అధికారులుగా ఉన్నప్పటికీ పనుల కోసం కాకినాడలోని ఎస్ఈలను, కొవ్వూరు డివిజన్ కూడా తూర్పుగోదావరి జిల్లాకి వచ్చింది కాబట్టి అక్కడ పనుల కోసం ఏలూరు ఎస్ఈలను సంప్రదించాల్సి వస్తుంది. జీతాలు కూడా రాజమహేంద్రవరం డివిజన్, రంపచోడవరం డివిజన్ ఇంజనీరింగ్ అధికారులకు ఈ శాఖల అధికారులు ఇక్కడే జీతాలు ఇస్తారు. కొవ్వూరు డివిజన్‌లోని అధికారులు భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లా అధికారులు డీడీవోలుగా ఉంటారు. పనులు ఒకచోట, జీతాలు ప్రతిపాదించేది మరొక చోట పెద్దసమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి వెళ్లినా ఇంకా లింక్ ఇక్కడే ఉంది. ఎక్సైజ్ విభజన కూడా పూర్తి కాలేదు. టాన్స్‌కోకు ఇంకా రాజమహేంద్రవరమే కేంద్రం. బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు ఇంకా కాకినాడ కేంద్రంగానే నడుస్తున్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ డీఆర్డీవో భవనంలో ఉండగా, ఇతర కార్యాలయాలు కాలేజీల్లో నడుస్తున్నాయి. సొంత భవనాలు ఊసే లేదు. అధికారుల బదిలీలు, ఇతర అంశాలు కూడా ఇంకా కొన్ని ఉమ్మడిగా ఉండడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లు ఉన్న సంగతి తెలిసిందే. అక్కడి పోలీసుల నుంచి ఇతర అధికారులంతా అంతా ఏలూరు కేంద్రం అనుమతితోనే బదిలీలు ఉన్నాయి. ఇతర శాఖల పరిస్థితి అంతే. జిల్లాలు పూర్తి స్థాయిలో విభజన జరిగి, కొత్త జిల్లా అధికారులకు పూర్తి స్థాయి అధికారాలు ఉంటేనే మేలుగా ఉంటుంది. కానీ జిల్లాలను హడావిడిగా విభజించిన వైసీపీ ప్రభుత్వం తర్వాత వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం గమనార్హం.

గ్రామస్థుల దాడిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొవ్వూరు, ఏప్రిల్ 3: అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై భయంతో గ్రామస్థులు దాడి చేయడంతో మృతి చెందాడు. కొవ్వూరు మండలం సీతంపేటలో ఈ దారుణం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం మండలంలోని సీతంపేట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నిక్కరు ధరించి గ్రామంలో ఒక ఇంటిముందు తిరుగుతున్నాడు. ఇటీవల సోషల్ మీడియాలో రాత్రి సమయంలో ఇంటిపై దాడిచేసి దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌కు సంబంధించిన వ్యక్తి అనుకుని ఆ ఇంటిలోని మహిళ ఆకుల నర్సవేణి పెద్ద పెద్ద కేకలు వేసింది. దీంతో గ్రామస్థులు గుమిగూడి ఆ వ్యక్తిపై మూకుమ్మడి దాడి చేశారు. అపస్మారకస్థితిలో కిందపడిపోయిన వ్యక్తిని వదిలిపెట్టి గ్రామస్థులు ఎవరికి వారు వెళ్లిపోయారు. ఉదయం చూసేసరికి అక్కడేపడి ఉన్న వ్యక్తిని చూసి స్థానికులు కొవ్వూరు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వ్యక్తిని పరిశీలించగా మృతి చెందాడని ధ్రువీకరించారు. దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. చనిపోయిన వ్యక్తికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదని, ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు రూరల్ ఎస్ఐ 9440796623, సీఐ 9440796621కు సమాచారం అందించాలన్నారు. మద్దూరులంక వీఆర్వో జి.వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు.

వెంకన్న ఆదాయం రూ.2.12 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,12,740 లభించినట్టు ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

ఓటు హక్కుపై అవగాహనకు ర్యాలీ



రంపచోడవరం, ఏప్రిల్ 3: ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహశీల్దారు ఎ.కృష్ణ జ్యోతి అన్నారు. మహిళా సంఘాలు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో బుధవారం రంపచోడవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసేలా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తహశీల్దారు కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. స్థానిక జూనియర్ కళాశాల ఎదురుగా విభూది బ్రదర్స్ కళానాటకం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో డీఎస్‌వీ రమణ, ఎంపీడీవో హరికృష్ణ, ఎస్ఐ మోహన్‌రావు, టీడీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు సూరమ్మ, ఇందిరాబామ్, వీఆర్వోలు గణపతి, సీహెచ్ రవి, రమాదేవి, జి.ప్రభాకర్, జి.భూషణం, సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి సీహెచ్ సుధా ప్రకాష్ పాల్గొన్నారు.

ఎంటీయూ-1293 వరి పైరు పరిశీలన

ఉప్పలగుప్తం, ఏప్రిల్3: గోపవరంలో దాళ్వాలో సాగుచేసిన ఎంటీయూ -1293వరిరకాన్ని ఆచార్యఎన్జీరంగావ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. ఈరకాన్ని మార్టేరు పరిశోధనా కేంద్రం రూపొందించింది. ఈరకానికి సంబంధించి చీడపీడలు, యాజమాన్యం, నేలస్వభావంపై శాస్త్రవేత్తలు రైతులతో చర్చించారు. ఈ రకం సాగుచేసిన జిల్లా రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరావు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

• అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు
• కామనగరువులో ఇంటింటా ప్రచారం
• పలు మండలాల్లో తెలుగుదేశం పార్టీలో చేరికలు

భక్తిశ్రద్ధలతో ఖురాన్ అవతరణ దినోత్సవం


మామిడికుదురు: ఖురాన్‌ను శిరస్సుపై ఉంచి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మామిడికుదురు, ఏప్రిల్ 3: రంజాన్ మాసంలో అత్యంత పవిత్రంగా నిర్వహించే ఖురాన్ అవతరణ దినోత్సవాన్ని (షబేకదర్) ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో మంగళవారం రాత్రి నిర్వహించారు. మామిడికుదురులోని షియా జామియా మసీదులో, నగరంలోని పెదపంజీష, మొగలికుదురులోని మసీదులో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మత ప్రబోధకుడు ఖురాన్ అవతరణ దినోత్సవ ప్రాముఖ్యతను, ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. భక్తులు మంగళవారం రాత్రి నుంచి తెల్లవారే వరకు ఖురాన్ ప్రతిని శిరస్సుపై ఉంచుకుని ప్రత్యేక నమాజు ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ సూక్తులను వల్లిస్తూ అల్లాను ప్రార్థిస్తూ తెల్లవారే వరకు జాగరణ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

యానాం కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం ప్రచారం

యానాం, ఏప్రిల్ 3: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యానాంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వి.వైద్యలింగం అన్నారు. వైద్యలింగం, మాజీ సీఎం నారాయణస్వామి తదితరులు బుధవారం ఉదయం యానాం వినాయక ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ యానాం ప్రతినిధులు మల్లాడి సత్తిబాబు, ఆర్థాని దినేష్, కాంటంశెట్టి రామూర్తి ఆధ్వర్యంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యలింగం, మాజీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే వైద్యనాధన్, పెద్దసత్య పెరుమాళ్లు, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.పల్లంరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు. యానాం అభివృద్ధికి కాంగ్రెస్ చేసే పనులను వివరించారు.


కాంగ్రెస్ బృందాన్ని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఉడిమూడి ర్యాంపులో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు


మానేపల్లి ర్యాంపులో లారీలను అడ్డుకున్న హెడ్‌వర్క్స్, రెవెన్యూ అధికారులు

అధికారులను ఖాతర్‌చేయని మట్టి మాఫియా

పి.గన్నవరం, ఏప్రిల్ 3: మండలంలో కొన్ని రోజులుగా అక్రమ తువ్వ మట్టి తవ్వకాలు అడ్డూఅదుపులేకుండా సాగుతున్నాయని ఒకరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం హెడ్‌వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎస్ మూర్తి, ఇన్‌చార్జ్ ఆర్ఐ పిసరసింహారావు, రెవెన్యూ, హెడ్‌వర్క్స్ సిబ్బంది ఉడిమూడి, మానేపల్లి, మొండెపులంక గోదావరి తీర ప్రాంతాల్లో తువ్వమట్టి ర్యాంపులను పరిశీలించి మట్టి లారీలను అడ్డుకున్నారు. అనుమతులకు సంబంధించిన పత్రాలు చూపించలేదని అధికారులు తెలిపారు. కాగా ఉడిమూడి మట్టి ర్యాంపులో అధికారులు మాట కూడా లెక్క చేయకుండా మధ్యాహ్నం నుంచి మట్టి లారీల రాకపోకలు యథావిధిగా కొనసాగాయని తెలిసింది. ఎన్నికల కోడ్‌లో కూడా ప్రభుత్వ పెద్దల అండదండలతో అధికారుల కనుసన్నల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చంద్రబాబు ప్రజాగళం సభకు జన నీరాజనం

ఉమ్మడి పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం

ఆత్రేయపురం, ఏప్రిల్ 3: రావులపాలెంలోటీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రజాగళం సభకు జనం నీరాజనం పలికారు. పసుపు, ఎరుపు, కాషాయ రంగులతో ఆ ప్రాంతం కళకళలాడింది. కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట, రావులపాలెం మండలాల్లోని 57గ్రామాల నుంచి ఉమ్మడి పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో కెనాల్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద బహిరంగసభ హోరెత్తింది. కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని ప్రచారరథంపై నుంచి చంద్రబాబు పిలుపునిచ్చారు.

భారీగా తరలివెళ్లిన జనం

కె.గంగవరం, ఏప్రిల్ 3: బుధవారం ద్రాక్షారామంలో జరిగిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సభకు మండలంలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వెళ్లారు.

ఆయుష్మాన్‌లో నమోదు చేయించుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 3: ఏరియా ఆసుపత్రిలో వైద్యానికి వచ్చే రోగులు ఆయుష్మాన్ డిజిటల్ భారత్‌లో నమోదు చేయించుకోవాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ప్రవీణ్ కోరారు. ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, మొబైల్‌ఫోన్ తీసుకురావాలన్నారు.

చంద్రబాబుతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు




అమలాపురం: ఆనందరావుకు హారతులు ఇస్తున్న మహిళలు, ఐ.పోలవరం: బుచ్చిబాబు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు, కాట్రేనికోన: దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

అమలాపురంరూరల్, ఏప్రిల్3: ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను నిలువునా ముంచిన జగన్ ప్రభుత్వానికి యువత గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐటీ సెక్టార్‌తో పాటు అన్ని రంగాల్లోనూ ఉద్యోగాలు కల్పించేలా మేనిఫెస్టోను రూపొందించినట్టు వివరించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు రాజులపూడి భీముడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కామన రాజు ఆధ్వర్యంలో బుధవారం కామనగరువులో ఆనందరావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జనసేన, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. సైకిల్‌పై తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి ఓట్లు అర్థించారు. రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడస్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నల్లా శ్రీధర్, లింగోలు పండు, కొప్పుల నాగమానస, మోకా వెంకట సుబ్బారావు, గండి స్వామి, సూదా చిన్నా, బట్టు పండు, దొమ్మేటి తాతాజీ, అధికారి జయవెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 3: తాళ్లరేవు మండలం పెద్దవలసల, లక్ష్మీపతిపురానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బుధవారం ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో బుధవారం టీడీపీలోచేరారు. పార్టీలో చేరిన వారిలో చెక్కా గణేష్, ఓలేటి వీరబాబు, బొడ్డు గణేష్, మేడ దేవరాజు, బొమ్మిడి రాజు, అర్థాని వీరబాబు, చిన్నఆదిబాబు, కొక్కిరిగడ్డ బాబూరావు, కొక్కిరిగడ్డ వీరబాబు, పాలెపు భైరవస్వామి, పాలెపు రమేష్‌వర్మ, కాలాడి మణికంఠ, అంగాడి సతీష్, కర్రి మధు, కాలాడి వీర్రాజు, కాలాడి తలుపులమ్మ, కర్రి కృష్ణ, లంకే రాజు, కామాడి రాము తదితరులున్నారు.

టీడీపీలో చేరికలు

కాట్రేనికోన, ఏప్రిల్ 3: ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో బుధవారం కాట్రేనికోన పంచాయతీ వెంకమ్మచెరువు, అడవిపేటకు చెందిన సుమారు 130మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. చేరిన వారిలో రేవు బాలు, మధుర లక్ష్మణస్వామి, మధుర రాంబాబు, మాదేటి దుర్గాప్రసాద్, పెయ్యల డేవిడ్‌రాజు, యాళ్ళ జయనారాయణ, మాదేటి లోవరాజు, గుత్తాల వీరవెంకటసత్యనారాయణ, గుత్తాల దుర్గాప్రసాద్, అయితాబత్తుల సుదర్శన్, బూల సుధీర్‌బాబు, బండి శ్రీనివాసరావు తదితరులున్నారు.

జనసైనికుల ఆత్మీయ సమ్మేళనం


ముమ్మిడివరంలో సమావేశమైన జన సైనికులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 3: జన సైనికుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల7న ముమ్మిడివరంలో నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దూడల స్వామి పేర్కొన్నారు. బుధవారం శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి దూడల స్వామి అధ్యక్షత వహించి మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ వైసీపీలో చేరడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి ఖాళీ అయినందున కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు, భవిష్యత్తులో పార్టీ చేపట్టే వ్యూహాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వరప్రసాద్ విజయం కోసం ప్రార్థనలు

మలికిపురం, ఏప్రిల్ 3: టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఎస్సీసెల్ అధికార ప్రతినిధి గెడ్డం సింహ ఇంటి వద్ద బుధవారం రాజోలు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ విజయం కోసం 150మంది దైవజనులు ప్రార్థనలు చేశారు. దేవ వరప్రసాద్ గెలుపు కోసం తామంతా పనిచేస్తామన్నారు. ఈసందర్భంగా దేవ వరప్రసాద్ మాట్లాడుతూ దైవజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో గెడ్డం సింహ, తాడి సత్యనారాయణ, పిల్లి జయప్రకాష్, కారుపల్లి ఏసురత్నం, జిల్లెల్ల బాబుప్రసాద్, తిరుమాని ఆచారి, కొల్లు మహలక్ష్మి, కాండ్రేగుల పల్లంశెట్టి, అప్పారి సత్యనారాయణ, కుడుపూడి శివాజీ, పమ్మి దుర్గాప్రసాద్, చిటికెన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మలికిపురం: వరప్రసాద్ గెలుపు కోసం ప్రార్థనలు

వైసీపీ మాయ మాటలు నమ్మొద్దు

పి.గన్నవరం, ఏప్రిల్ 3: వైసీపీ ప్రభుత్వం రాకపోతే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని వైసీపీ పెద్దలు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ మండిపడ్డారు. ఉమ్మడి ప్రభుత్వంలో నిరుపేదలకు సంబంధించిన ఏ సంక్షేమ పథకం రద్దుకాదని ఆయన స్పష్టం చేశారు. ఉడిమూడి శివారు ఉడిమూడిలంకలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిడ్డి సత్యనారాణ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జార్జ్ పోపవ్, యేసు బాబ్జి, ముంగి యేహో సువా, మహమ్మద్ ఆనంద్, పరంజ్యోతి, జార్జిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హరీష్, వరప్రసాద్ ఎన్నికల ప్రచారం

అంతర్వేది, ఏప్రిల్ 3: సఖినేటిపల్లిలంకలో గురువారంఉదయం 9గంటలకు, సఖినేటిపల్లిలో 11గంటలకు, అప్పనరామునిలంకలో మధ్యాహ్నం 3గంటలకు పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్‌లు ఎన్నికల ప్రచారం చేస్తారని స్థానిక నాయకులు తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల నాయకులు, గ్రామశాఖల అధ్యక్షులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాలని జనసేన సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు కోరారు. మండల అధ్యక్షుడు గుబ్బల పణికుమార్, తాడి మోహన్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, రావూరి నాగు, ఉండపల్లి అంజి పాల్గొన్నారు.

నాటు సారాతో మహిళ అరెస్టు

ఆత్రేయపురం, ఏప్రిల్3: అంకంపాలెంలో సారా అమ్ముతున్న మానే మంగను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. 5లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్టు ఎస్ఐ శ్రీనివాస్‌తెలిపారు.

దివ్యాంగ ఓటర్లకు సౌకర్యాలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 3: దివ్యాంగ ఓటర్ల కోసం ఎన్నికల సంఘం కల్పించిన వసతులను వినియోగించుకోవాలని దివ్యాంగుల ఎన్నికల నోడల్ అధికారి బీవీ రమణ పేర్కొన్నారు. బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ బి.శ్రీనునాయక్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం దివ్యాంగులు, వృద్ధులకు పలు సౌకర్యాలు కల్పించిందన్నారు. రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావు మాట్లాడుతూ దివ్యాంగులకు, 85ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే హోం ఓటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటింగ్‌పై దివ్యాంగులకు, వృద్ధులకు, సీనియర్ సిటిజన్లకు అవగాహన కల్పించారు. అనంతరం దివ్యాంగులతో ర్యాలీ నిర్వహించారు. ఒత్తిళ్లకు లోను కాకుండా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, మండల, బూత్ లెవెల్ అధికారులు, దివ్యాంగుల జేఏసీ చైర్మన్ నిమ్మకాయల సురేష్, నలమాటి లంకరాజు, చిక్కం ఆదినారాయణ, సీనియర్ సిటిజన్లు, నగర పంచాయతీ, మెప్మా, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

సోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఉప్పలగుప్తం, ఏప్రిల్ 3: చినగాడవిల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామ దేవత సోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. బాదంపూడి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కొమాళ్ళపల్లి కాశీవిశ్వనాథం బ్రహ్మత్వంలో శైవాగమోక్త ప్రకారం పూజలు నిర్వహించారు. మేడిద వీరాస్వామినాయుడు-సీతానాగలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు సోమాలమ్మను పూజించి ముడుపులు చెల్లించుకున్నారు.

సచివాలయాల వద్ద పింఛన్ల కోసం పడిగాపులు

అల్లవరం, ఏప్రిల్ 3: పింఛన్ల అందక వృద్ధులు, దివ్యాంగులు గ్రామ సచివాలయాల వద్ద బుధవారం పడిగాపులు కాశారు. పింఛన్ ఇస్తారని సచివాలయానికి వెళ్లి అనేక మంది వెనుదిరిగారు. బ్యాంకుల్లో సొమ్ములు డ్రాచేసి ఇస్తామని వారిని పంపించేశారు. 23సచివాలయాల్లో కొన్ని సచివాలయాలకు కొద్ది మొత్తంలో సొమ్ములు రావడంతో బుధవారం సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ చేస్తున్నామని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమూర్తి అన్నారు.

పి.గన్నవరం: మండలంలో 11 సచివాలయాల పరిధిలో బుధవారం పింఛన్ల పంపిణీ చేపట్టలేదు. ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శుల ఖాతాలో నగదు జమ చేసింది, కానీ యూనియన్ బ్యాంకులో నగదు లేకపోవడంతో పింఛన్లు పంపిణీ చేపట్టలేదు. దీంతో వృద్ధులు నిరాశ చెందారు. 12సచివాలయాల పరిధిలో బుధవారం సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. బుధవారం ఉదయం నుంచి వృద్ధులు, వికలాంగులు సచివాలయాల వద్ద పింఛన్ల కోసం పడిగాపలు కాశారు. మండల వ్యాప్తంగా 10,336 పింఛన్లకు రూ.2.99కోట్లు పంపిణీ చేయవలసి వుంది.

మామిడికుదురు: మండలంలో 10,259 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా బుధవారం 1,210 పింఛన్లు పంపిణీ చేసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. లబ్ధిదారులకు రూ.2.91కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1.10కోట్లు ప్రభుత్వం అందించిందని, ఇంకా రూ.1.81కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. నగదు లేక పంపిణీ ఆలస్యం చేస్తుందని, దానిని ప్రతిపక్షాల కుట్రగా అసత్య ప్రచారం చేస్తుందని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19గ్రామాలకు ఆయా గ్రామాల్లోని సచివాలయ వద్ద బుధవారం ఫించన్ దారులు పడిగాపులు పడ్డారు. బ్యాంకు నుంచి సొమ్ములు ఇంకారాలేదని వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో ఎండవేడిమిని లెక్కచేయకుండా నిరీక్షించాల్సి వచ్చింది. మండలంలో 9,848 పింఛన్లకు రూ.2.97కోట్లు విడుదల కావల్సి ఉండగా బుధవారం సాయంత్రానికి రూ.1.95కోట్లు విడుదల కావడంతో వాటిని పంపిణీ చేశామని ఎంపీడీవో ఎ.కొండలరావు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3: అమలాపురం 26వ వార్డులోని సూర్యబలిజ వీధిలో భాస్కర్ల పద్మావతి, యండమూరి సింహాచలం జ్ఞాపకార్థం భాస్కర్ల రామకృష్ణ, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ప్రారంభించాడు. కార్యక్రమంలో సుబ్బాలమ్మ దేవస్థానం, మాజీ చైర్మన్లు పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు, కాలె వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి మూర్తి, మొగలి శ్రీను, కొప్పుల బాబీ, పందిరి వాసు, యండమూరి సత్తిబాబు, సరిదె రమణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై ఆరోపణలు సరికాదు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 3: పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వం నిధులు రూ.13వేల కోట్లు సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టి ఖజానా ఖాళీ అవ్వడంతో జగన్ ప్రభుత్వం మరో కొత్త నాటకానికి తెరలేపిందని తెలుగు యువత రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొప్పిశెట్టి వాసు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పింఛన్లు పంపిణీ చేయకపోవడానికి నిధులు కొరతే కారణమని, తెలుగుదేశం పార్టీ ఏ మాత్రం కాదన్నారు. పేదలపై అంత ప్రేమ ఉన్న జగన్‌రెడ్డి ఏప్రిల్ ఒకటో తేదీన ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయాలని ఎందుకు ఆదేశాలు జారీచేయలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని అన్నారు.

జనసేనకు రాజబాబు రాజీనామా

రావులపాలెం, ఏప్రిల్ 3: జనసేన పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు తెలిపారు. రావులపాలెంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలాపురంలో జనసేన పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశం ఉన్నప్పటికీ తనకు టిక్కెట్ కేటాయించలేదన్నారు. తాను టీడీపీ జెండా మోయడానికి సిద్ధంగా లేనన్నారు. తాను ఇంకా ఏ పార్టీలోనూ చేరలేదని, రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ద్రాక్షారామ, ఏప్రిల్3: మండలం సర్వసభ్యసమావేశం బుధవారం ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎన్నికల నియమావళి నేపథ్యంలో సమీక్షలు, తీర్మానాలు లేకుండా సమావేశం వాయిదావేశారు. ఎంపీడీవో రామచంద్రరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: కలియుగ పట్టణంలో
వెంకటరమణ	: ప్రేమలు
శ్రీలలిత	: గో ఎట్ లైఫ్
శేఖర్ స్ర్కీన్-1	: ఓం భీమ్‌బుష్
శేఖర్ స్ర్కీన్-2	: తలకోన
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: ఊరిపేరు భైరవకోన
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: డీజేటిల్లు స్క్వేర్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు కూల్‌డ్రింక్స్



అమలాపురం టౌన్, ఏప్రిల్ 3: అమలాపురం జిల్లాపరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన చేస్తున్న 1100 మంది సహచర ఉపాధ్యాయులకు ఎస్టీయూ జిల్లాశాఖ చల్లచల్లని కూల్ డ్రింకులను సమకూర్చింది. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ ఆధ్వర్యంలో మూల్యాంకన కేంద్రం వద్ద బుధవారం కూల్‌డ్రింకులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా, వివిధ మండలాల నాయకులు బోనం నారాయణ, బండారు నారాయణ, నల్లా రామకృష్ణ, కుడుపూడి హేమంత్, తోట బాలకృష్ణ, నందెపు శ్రీనివాస్, యండమూరి శ్రీనివాస్, గుప్తా, హెచ్ఎంలు ఎస్.రాజరాజేశ్వరి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

31 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు

ఆలమూరు, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో 31పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించినట్టు కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన లంక గ్రామాల్లో పలు కేంద్రాలను పరిశీలించి రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో సౌకర్యాలపై ఆరా తీశారు. ఆలమూరు, పినపళ్ల, గుమ్మిలేరు, నర్సిపూడి, చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లోని 31కేంద్రాలను సమస్యాత్మకంగా, వీటిలో కొన్నింటిని తీవ్ర సమస్యాత్మకంగా గుర్తించారు. ఆయా చోట్ల అదనపు బలగాలను ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దారు అనిల్‌కుమార్, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 3: ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పితాని వీరవెంకటసత్యనారాయణ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ముమ్మిడివరం భవిత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు పలు రకాల వస్తువులు, తినుబండారాలను వితరణగా అందించారు కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి కె.శ్రీలక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కె.గంగవరం, ఏప్రిల్ 3: సత్యవాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అయ్యప్పస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు బిక్కవోలు కేశవాచార్యులు బ్రహ్మత్వంలో ఆలయంలో అయ్యప్ప స్వామి, కన్నెమోల గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మాలిగాపురత్తమ్మ వారి విగ్రహాలు ప్రతిష్ఠ చేశారు. పూర్ణాహుతి నిర్వహించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

సాగునీటి సమస్య రాకుండా చర్యలు

అల్లవరం, ఏప్రిల్3: మండలంలో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని డీపీవో రాంబాబు అన్నారు. అల్లవరం మండల పరిషత్ వద్ద ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఉపాధి ఫీల్డుఅసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సీ-విజిల్‌లో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. పింఛన్ల పంపిణీలో సచివాలయాల వద్ద తాగునీరు, నీడ ఉండాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. ఏవో బి.లక్ష్మణరావు, ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, ఈవోపీఆర్డీ ఎన్.సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఎన్నికల్లో జగన్‌కు బీసీల సత్తా చూపిస్తా: శ్రీనివాస్

రాజోలు, ఏప్రిల్ 3: రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి బీసీల సత్తా చూపిస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ అన్నారు. బుధవారం శివకోటిలో క్లస్టర్-7 ఇన్‌చార్జి కసుకుర్తి త్రినాథస్వామి ఆధ్వర్యంలో గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు కడలి ఏడుకొండలు స్వగృహం వద్ద రాజోలు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మెరుగుమువ్వల సత్యవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సమావేశానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా గుబ్బల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందన్నారు. అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థి గంటి హరీష్‌కుమార్, రాజోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దేవవరప్రసాద్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముదునూరి చినబాబురాజు, చాగంటి స్వామి, మంగెన భూదేవి, చెల్లింగి సత్యనారాయణ, ఆరుమిల్లి భాను, పిండి సత్యనారాయణ, బందెల పద్మ, మటపర్తి లక్ష్మి, మోకా పార్వతి, కడలి సునీత, ఎంపీటీసీలు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు, రాజోలు గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కడలి వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

అల్లవరం, ఏప్రిల్ 3: ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు అన్నారు. ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ప్రారంభమైన స్పోర్ట్స్ మీట్ సభలో ఆయన మాట్లాడారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నాలుగు రోజులు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఏ చంద్రమౌళి తెలిపారు. డాక్టర్ టీవీ జనార్థనరావు, పీడీలు టి.దుర్గారావు, కె.సత్యనారాయణపాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

మండపేట, ఏప్రిల్ 3: వేసవిలో సాగునీటి ఎద్దడిలేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జోగేశ్వరావు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కేశవరానికి చెందిన టీడీపీ శ్రేణులతో వేగుళ్ల సమీక్ష నిర్వహించారు. కొంతమంది రైతులు తమ పొలాలకు సాగునీరందడం లేదని వివరించారు. దీంతో వేగుళ్ల ఇరిగే షన్ డీఈఈతో మాట్లాడి నీటి ఎద్దడిలేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాజు కుటుంబానికి ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, ఏప్రిల్ 3: మారేడుబాకకు చెందిన కాదరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు విశాఖలో కిమ్స్ ఆసుపత్రికి అవయవదానం చేశారు. మంగళవారం రాత్రి మారేడుబాకలో రాజు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. రాజు కుటుంబ సభ్యులను వేగుళ్ల బుధవారం పరామర్శించారు. స్థానిక టీడీపీ నేతలు పసలపూడి శ్రీను, రాయుడు గంగరాజు, వాసంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రొయ్యల శుద్ధి కర్మాగార నిర్మాణం


దొంతికుర్రులో రొయ్యల శుద్ధి కర్మాగార నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కాట్రేనికోన, ఏప్రిల్3: దొంతికుర్రు సమీపంలో పంట పొలాల మధ్యలో అనధికారికంగా రొయ్యల శుద్ధి కర్మాగార నిర్మాణ పనులు వేగంగా జరుగు తున్నాయి. దీనికి పంచాయతీ అనుమతి కూడా లేదు. గతంలో స్థానికులు స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. అధికారులు పరిశ్రమ యాజమాన్యానికి కొమ్ముకాస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం అసత్య ప్రచారాన్ని మానుకోవాలి

మామిడికుదురు, ఏప్రిల్ 3: పెన్షన్ల విషయంలో ప్రభుత్వం అసత్య ప్రచారాన్ని మానుకోవాలని జనసేన నాయకులు కోరారు. మామిడికుదురు పంచాయతీ కార్యాలయం వద్ద పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ బుధవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం స్వలబ్ధి కోసం పెన్షన్ల పంపిణీలో జాప్యం చేస్తుందని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆరోపించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీచేసే విధంగా చూడాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో రుద్ర శ్రీనివాస్, ఇంటి మహేంద్ర, అప్పన రామకృష్ణ, బత్తుల శేఖర్, రాజేష్, నయినాల నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లొల్లలో కంటి వైద్య శిబిరం

రాయవరం, ఏప్రిల్ 3: లొల్ల విశ్వమానవతా ఆశ్రమంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు 95మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య బృందం ఎ.సుబ్రహ్మణ్యం, జి.సురేంద్ర, పి.కొండలరావు, ఎస్.విజయ సునంద, చాట్రాతి జానకి రాంబాబు, ఆశ్రమం ప్రతినిధి కర్రి సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై అధికారుల విచారణ

రాయవరం, ఏప్రిల్ 3: మాచవరానికి చెందిన 17వ నెంబరు రేషన్ డీలర్ గత నెల30న మాచవరంలో వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో తహశీల్దారు కృష్ణారావు సంఘటనపై విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిసింది.

ఉచిత శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి

మామిడికుదురు, ఏప్రిల్ 3: బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఇస్తున్న పాలిటెక్నిక్ ఉచిత శిక్షణా తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ కోరారు. మామిడికుదురులోని బీసీ సామాజిక భవనం, అమలాపురం, పి.గన్నవరం, మలికిపురం మండలాల్లో బుధవారం శిక్షణా తరగతులు ప్రారంభినట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తుల వీరబ్రహ్మం,జిల్లా కార్యదర్శి కర్రి సుబ్బరాజు, ఉపాధ్యక్షుడు ఎస్.సత్యపల్లంరాజు, విత్తనాల శ్రీనివాసరావు, వస్కా వెంకటేశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 3: రాజ్యాంగ పరిరక్షణకు ఇండియా కూటమిని గెలిపించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రామచంద్రపురంలో నిర్వహిస్తున్న ఎన్నికల వర్క్ షాపు రెండో రోజు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డా. స్టాలిన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నంపెంచలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రాము, ప్రజానాట్యమండలి ఉమ్మడి గోదావరి జిల్లా ఇన్‌చార్జి మహంత లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.